
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# నేనేమనుకుంటాను?

" నువ్వేమంటావ్ కళా, వెళ్ళనా? వద్దా?" అడిగింది ఆశ ఆత్రంగా.

ముక్కుమీదకు జారుతున్న కళ్ళద్దాలని పైకి తోసుకుంటూ ఎదురుగా కూర్చున్న స్నేహితురాలిని ఎగాదిగా చూస్తోంది కళ.

" చెప్పవే!!" అంది ఆశ విసుగ్గా.. బదులుగా కళ నవ్వింది సన్నగా.

" చంపేస్తాను నిన్ను" అంది ఆశ కోపంగా. కళ నవ్వు చూస్తే ఆమె ఆత్రుత చిరాకుగా, కోపంగా మారింది. కళ మాట్లాడలేదు. అలాగే కళ్ళజోడు ముక్కుమీదకి జార్చుకుని అలాగే కూర్చుంది. కాఫీ షాప్ లో కూర్చుని ఉన్నారు ఇద్దరూ. తన కాఫీ కప్పులో స్ట్రాని ఇటూ, అటూ కలుపుతూ కూర్చుంది కళ.

"మాట్లాడవేం? ఇంకేమైనా తింటావా?అప్పుడైనా నీ నోరు పెగులుతుందేమో! చెప్పు! " అంది ఆశ.

" నువ్వూరికే కంగారు పడకు! కాసేపాగితే ఇద్దరి సమస్యలూ ఒకేసారి తీర్చేసుకోవచ్చు ముగ్గురం కలిసి" అంది కళ

" ముగ్గురమూనా? అంటే మీనా వస్తోందా? హౌ నైస్! ముందే చెప్పలేదేం? దానికేమైంది? ఎలా ఉంది?" అంటూ ఆశ ప్రశ్నలు వేస్తూ ఉండగానే మీనా వచ్చింది అక్కడకి. నొక్కుల నల్లటి జుట్టూ, చూడగానే ఆకట్టుకునే రూపం, మీనా ఏమీ మారలేదు అనుకుంది ఆశ. ముగ్గురూ ఒకరినొకరు ఆనందంతో కౌగలించుకుని పలకరించుకున్నారు.

ముగ్గురూ ఇంటర్ మీడియేట్ నించి ఇంజనీరింగ్ దాకా ప్రాణ స్నేహితులు. మధ్యలో మీనా వాళ్ళు పూనే వెళ్ళవలసి రావడం వల్ల కొద్దిగా రాకపోకలు మందగించాయి. ఆ తర్వాత పిల్లలు, ఉద్యోగాలు, సంసారాల గొడవల్లో పడి కలుసుకోవడం తగ్గింది. అయినా క్రమం తప్పకుండా ఫోన్ లూ, మెసేజ్ లూ అన్నింటికీ మించి ముగ్గురి మధ్యనా నెలకొన్న చిన్ననాటి స్నేహాన్ని పదిలంగా ఉంచాయి.

"మీ ఇద్దరినీ చూస్తూ ఉంటే నాకేమనాలో అర్థం కావటం లేదు"అంది కళ.

" అవునులే! సమస్య నీది కాదుగా, నవ్వుగానూ ఉంటుంది, ఏమనాలో తెలియదనీ అంటావు" అంది మీనా కోపంగా.

"ఏమనమంటారో మీరే చెప్పండి!" అంది కళ.

మనలో మొదటినించీ నువ్వే ధైర్యవంతురాలివి, అన్నింటికీ మంచి సలహాలు చెప్తావనీ నిన్నడిగాను నేను, అంతే కానీ ఇలా వెక్కిరిస్తావని కాదు" అంది ఆశ కాస్త ఉక్రోషంగా.

" నేనూ అంతే, నేను తేల్చుకోలేక స్నేహితురాలివి కదా అని నీకు చెప్పాను" అంది మీనా.

" ఓకే, ఓకే, నేను కాదనడం లేదు. మీ ఇద్దరికీ నా మీద ఉన్న నమ్మకానికి చాలా థాంక్స్. ముందు మీ కథలేమితో విందాం, అప్పుడు ముగ్గురం కలిసి పరిష్కారం చెప్పచ్చేమో" అంది కళ.

" ఓకే" అంది ఆశ తను ముందు చెప్పడం మొదలు పెడుతూ.

-------------

"నా టెక్నాలజీ డిగ్రీ కి తోడు ఎం. బి ఏ కూడా ఉంటే బావుంటుంది అని ఈ మధ్య తరచుగా!అనిపిస్తోంది. "భర్త అనిల్ తో అంది ఆశ.

" ఇప్పుడా?" అన్నాడు అనిల్ ఆశ్చర్యంగా. ఆశ కి కెరియర్ మీదున్న మక్కువ అతనికి బాగా తెలుసు, కానీ ఇప్పుడు నిండా మూడేళ్ళు కూడా లేని చిన్నపిల్ల పనులతో సహా అన్నీ చేసుకుంటూ చదువుకోగలదా? అన్నది అతని ప్రశ్న కి మూలం. అదే మాట ఆమెతో అన్నాడు.

" నువ్వు చెప్పింది నిజమే అనిల్. కానీ ఇప్పుడు కాకపోతే ఎప్పుడు? అనేదే ఆలోచిస్తున్నాను" అంది ఆశ.

" కానీ" అతను అంటున్న భర్తని అడిగింది

" కానీ కాదు అనిల్. ఇప్పుడు నేనున్న పొజిషన్ కి, మేనేజర్ గా ఎదగాలన్న నా కలకి ఇప్పుడు నేను ఎం.బి.ఏ చేస్తే నాకెంతో హెల్ప్ అవుతుంది. నాకు టెక్నాలజీ కంటే మొదటినించీ మేనేజర్ పదవి అంటే ఇష్టం అని నీకు కూడా తెలుసు కదా! అందుకే అనుకుంటున్నాను, ఇప్పుడే ఎం.బి. ఏ చెయ్యాలని కాదంటావా?" అంది.

" అవుననుకో, నువ్వు చెప్పినదేదీ అబద్ధం కాదు కానీ ఒక్క సంవత్సరం ఆగితే బావుంటుందేమో, అనహిత కి మూడేళ్ళే కదా ఇప్పుడు, ఒక్క సంవత్సరం ఆగితే పూర్తి రోజంగా స్కూల్ కి వెళ్తుంది కదా, అప్పుడు నీకు మరికొంచం టైముంటుంది కదా! అని" అన్నాడు

" అంతేనా? మనకున్న లోన్ చాలనట్టు ఇదోక అదనపు ఖర్చుని కాదు కదా?" అంది నవ్వుతూ.

" ఛా, ఛా, అలా ఎప్పటికీ అనుకోకు ఆశా! నీ ఆశలకీ, కలలకీ నా సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది. అందుకని నీకిప్పుడు చెయ్యాలనిపిస్తే ఇప్పుడే చెయ్యి. కానీ ఆలోచించుకో, వర్క్ ప్రెషర్, ఇల్లూ, అనహిత, నేనూ.. ఇవన్నీ చూసుకుంటూ చదువుకోగలవా? అని చూసుకో" అన్నాడు అనిల్.

" నాకు తెలుసు అనిల్ నీ కన్సర్న్. కానీ ఇప్పుడున్న కాంపిటీషన్, మన కంటే చిన్నవారిలో ఉన్న చురుకూ, తెలివీ చూస్తూ ఉంటే మనం ఎంత తొందరగా ఈ ముందుకెళితే అంత మంచిది, లేకపోతే మనకున్న అనుభవం కూడా ఎందుకూ పనికిరాదు. వెనకబడి పోతాం అంతే, సింపుల్"" అంది ఆశ.

అలా ఆమె ఎం. బి. ఏ కోర్స్ కోసం ఉన్న వివిధ కోర్స్ లు, యూనివర్సిటీలు లాంటివన్నీ చూడడం, రోజూ దానిగురించి మాట్లాడుకోవడం అయ్యాకా, ఒకరోజు అంది ఆశ

" నేను ఇప్పుడు డిసైడ్ చేసుకున్నాను అనిల్. ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీలో నా ఫ్రెండ్ సనా చేస్తున్న కోర్స్ నాకు చాలా నచ్చింది. అది అయితే నాకు కరక్ట్ గా అనిపిస్తోంది. అందుకని అందులోనే చేరదామని అనుకుంటున్నాను" అంది ఆశ.

" ఆస్ట్రేలియా నించా? కోర్స్ ఫీజు, అక్కడికి వెళ్ళి రావడం లాంటి అవసరాలు అవీ" అన్నాడు అనిల్.

"యా, కోర్స్ నాకు చాలా నచ్చింది. నాకు సరిగ్గా సరిపోయేలా ఉందిమిగతావన్నీ చూసుకోవచ్చు. ఇంక ఖరీదు విషయానికొస్తే మన దేశంలోని చదువులు మాత్రం ఏం చవకగా ఉన్నాయి. పైఇగా ఫారెన్ డిగ్రీ అంటే విలువ ఎక్కువని అనిపిస్తోంది నాకు. మిగతా విషయాలు అక్కడిదాకా వచ్చినప్పుడు చూద్దాం లే" అంది ఆశ.

"' సరే, నీ ఇష్టం" అన్నాడు అనిల్.

అలా ఆమె కోర్స్ లో చేరింది. పిల్ల పనీ, ఇంటి పనీ, ఆఫీస్ పనీ, చదువూ ఇవన్నీ నిర్వహించుకోవడానికి మొదట్లో చాలా కష్టపడినా తర్వాత మెల్లిగా అలవాటు పడింది. చాలా శ్రద్ధగా చదువుకునేది, అసైన్మెంట్లన్నీ టైముకి పూర్తి చేసేది. అన్నీ బాగా అవుతుండేసరికి ఆశ ఉత్సాహం మరింత పెరిగింది.

కోర్స్ లో భాగంగా దాదాపు మూడు నెలలు ఆస్ట్రేలియాలో ఉండి కొన్ని క్లాస్ లకు వెళ్ళి, తోటి విద్యార్థులతో కలిసి కోర్స్ వర్క్ చేసి రావాలి. అప్పుడే వచ్చింది ఆమెకి సమస్య.

" మూడు నెలలంటే ఎలా వెళ్ళగలను? కష్టం కదా? " అంది ఆశ

" కష్టమనుకుంటే కష్టం,లేదంటే లేదూ ఏదైనా మనం అనుకోవడంలోనే ఉంది. " అన్నాడు అనిల్.

" నువ్వు చెప్పు ఏం చెయ్యను?" అంది

" అది నువ్వు నిర్ణయించుకోవాలి ఆశా" అన్నాడు అనిల్. అతను మామూలుగానే అన్నా ఆమెకెందుకో తనని దెప్పుతున్నాడేమో అనిపించింది.

" అదేంటి అనిల్? అలా ఎందుకంటావు? నీకు తెలుసు కదా, మనిద్దరం అన్నీ మాట్లాడుకున్నాకే కదా నేను కోర్స్ లో చేరాను. నీ సపోర్ట్ నాకెప్పుడూ ఉంటుందని చెప్పి ఇప్పుడిలా అంటే?" అంది చిరుకోపంగా.

" ఇప్పుడూ అదే మాట చెప్తాను ఆశా, నా సపోర్ట్ నీకెప్పుడూ ఉంటుంది, కానీ నీకు సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు మాత్రం నువ్వే తీసుకోవాలి కదా!" అన్నాడు.

" అనహిత నేను లేకుండా ఎలా ఉంటుంది? పోనీ ముగ్గురం వెళ్ళిపోదాం" అంది.

" ఓ! ఐడియా బాగానే ఉంది. ఐతే మా ఆవిడ ఎం. బి. యే చేస్తోంది కనక నాకు సెలవు ఇవ్వండి అంటే మరి ఇచ్చే కంపెనీ ఏదైనా ఉండేమో చూసుకుని, నేను అందులో చేరతాను. అప్పుడు హాయిగా వెళ్ళచ్చు" అన్నాడు.

" జోక్ కాదు అనిల్, నేను నిజంగానే అన్నాను" అంది ఆశ.

" నిజమే, ముగ్గురం అక్కడకి వెళ్తే అయ్యే ఖర్చు గురించి ఆలోచించావా? అదొక్కటే కాదు, ఇక్కడికీ,అక్కడికీ వాతావరణం తేడా, పాప ఇంకా చిన్నది కదా, " అన్నాడు.

" అవును, నిజమే" అంది తన ఒళ్ళో నిద్రపోతున్న రెండున్నరేళ్ళ కూతురి తల నిమురుతూ

" పోనీ నువ్వు మీ అమ్మగారిని తీసుకెళ్ళు" అన్నాడు.

" వద్దు, నాన్నకి ఆరోగ్యం సరిగా ఉండదు, పైగా ముగ్గురు మనుషులు వెళ్తే అయ్యే ఖర్చు అప్పుడయినా ఒకటే కదా!" అంది.

"అదీ నిజమే"అన్నాడు అనిల్.

" ఇది నా పరిస్థితి. కష్టపడి మొదలుపెటిన చదువు, ఎలాగోలా ఈ క్లాసులు పూర్తి చేసుకుని వస్తే నాకు అన్ని రకాలుగా బావుంటుంది. ఇటు చూస్తే అనహిత చిన్నది, దాన్ని వదిలి ఉండగలనా? నేను లేకుండా ఉంటుందా? అని నా భయం. పాపం మా అత్తగారు నాకు ఫుల్ సపోర్ట్ అనుకోండి. ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసిన మనిషిగా ఆవిడ వ్యకి అస్వేచ్చకు ఎంతో ప్రాధాన్య,ఉత ఇస్తారు. మేము ఉద్యోగాలు చేసే వేళలో ఇలాంటి అవకాశాలు లేనే లేవు, ఇప్పుడున్నాయి కనకా, మనకి అందుకునే స్థోమత ఉంది కనక నువ్వు తప్పకుండా చెయ్యి. మూడు నెలలు ఎంతలో తిరుగుతాయి? అంటున్నారనుకో, మధ్యలో అమ్మ కూడా వచ్చి చూస్తానంటోంది. అయినా సరే నాకే ఎందుకో ఏం చెయ్యాలో తెలీదం లేదు. అందరినీ సలహా అడుగుతున్నాను, ఏం చెయ్యను అని" " అంది ఆశ దీనంగా.

కళ మళ్ళీ అదే నవ్వుతో " ఏం చేద్దామని? ఎంత మంది వెళ్ళమంటారో, ఎంతమంది వద్దంటారో అని తెలుసుకోవడానికా? తెలుసుకుని ఏం చేస్తావు?" అంది కళ కాస్త కోపంగా. అలా అంటూనే ఉండుండు ఈవిడగారిని కూడా చెప్పనీ! అంటూ మీనా వైపు తిరిగి "ఇప్పుడు నీ కథ చెప్పమ్మా, మీనమ్మా!, "అంది స్నేహితురాలి కథ విని ఏదో చెప్పబోతున్న మీనా తో.

"నీకు ఉద్యోగంలో పైకి వెళ్ళాలని చదువుకోసం కుటుంబాన్ని వదిలి వెళ్ళడమా, వద్దా ? అన్నది సమస్య అయితే, కుటుంబం కోసం ఉద్యోగం వదిలెయ్యడమా, లేదా? అన్నది నా సమస్య" అంది మీనా సింపుల్ గా.

" ఉద్యోగా మానేస్తావా? నువ్వేనా ఈ మాటంటున్నది? " అడిగింది ఆశ. చిన్నప్పటినించీ మీనాకి స్వతంత్రంగా ఉండడం ఎంత ఇష్టమో, పెద్ద ఉద్యోగం చేసి మంచి పేరు తెచ్చుకోవాలనేది ఎంత మక్కువో ఆశాకి బాగా తెలుసు.

మాట్లాడలేదు, మౌనంగా తలవంచుకుని చేతివేళ్ళకున్న గోళ్ళరంగును చూసుకుంటోంది మీనా.

" చెప్పు మీనా, నువ్వేనా ఈ మాటలన్నది?" అంది ఆశ. కళ ఇద్దరినీ చూస్తోంది.

" అవును ఆశా, నేనే.. నీకు తెలుసు కదా, నా పిల్లల కొసమే అనుకుంటున్నాను. కానీ ఇదీ అని నిర్ణయించుకోలేక సతమతమవుతున్నాను. ఒకరకంగా అలసిపోయాననే చెప్పాలి. ఇల్లూ, పిల్లలూ, ఆఫీస్ పన్లూ, ఒత్తిళ్ళూ, ఇవన్నీ నాకొక్కదానికే ఉన్న సమస్యలని నేను అనడం లేదు. అనలేను. కానీ ఈ మధ్యన ఆయనకి కూడా ఆఫీస్ పని మీద తిరగడం బాగా ఎక్కువయింది. పాప కొద్దిగా పెద్దదియిందనుకో, తర్వాత పుట్టిన కవలపిల్లలిద్దరూ ఇంకా చిన్నవాళ్ళు. ఎప్పుడూ పాపం అమ్మా, అత్తగార్లని ఇబ్బంది పెట్టడం అవుతోంది ఎప్పుడూ.

ఏరోజు ఏమవుతుందో తెలియదు. మొన్న స్కూల్లో పడి కాలు విరగ్గొట్టుకుంది వర్ష, చిన్నవాళ్ళిద్దరిలో ఎప్పుడు జ్వరమే వస్తుందో, జలుబే వస్తుందో చెప్పలేము. సగం మనసు ఇంటి మీద పెట్టుకుని చేసే పని సరి అయినదేనా? ఒప్పుకున్న పనికి అన్యాయం చేసినట్టు కాదూ!! ప్రతీ రెండు రోజులకోసారి ఇంట్లో ఏదో అయిందంటూ సెలవులు పెడితే బావుండదు కదా!

ఇవన్నీ చాలనట్టు ఆఫీసులో రాజకీయాలు. పని చెయ్యడానికి వస్తారా? వీటి కోసమే వస్తారా అనిపిస్తుంది కొందరిని చూస్తే. ఎంత పట్టించుకోకూడదనుకున్నా కొన్ని మాటలు సూటిగానే తగిలాయి, తగుల్తాయి.

అలా అని ఇంట్లోనూ ఊరికే ఉండలేను. ఉండలేక పోవడం, బోర్ కొట్టడం లాంటివి పక్కన పెడితే పెరుగుతున్న పిల్లల అవసరాలన్నీ ఎలా తీర్చగలం? ఇంతకంటే ఒక్కసారే ఉద్యోగం మానేస్తే తీరిపోతుందని అనిపించినప్పుడల్లా రోజు రోజు కీ పెరిగిపోతున్న ధరలు, స్కూళ్ళ ఫీజులు, పుస్తకాలు వగైరాలు చూస్తుంటేనే భయం వేస్తుంది.. ఎంత సంపాదిస్తే సరిపోతుంది? అనేది అందరికీ పెద్ద ప్రశ్న. ఈ మహానగరంలో స్కూళ్ళు, బస్సులూ, ఎంత ఖరీదో మీకు తెలియని దేమీ కాదు.

తనని అడిగితే ఒకటే మాట " నీ కెరియర్, నీ ఇష్టం, నిర్ణయించుకోవలసింది నువ్వు" అంటారు. ఎవరినడిగినా అదే మాట. ఇంతకుముందు రెండు సార్లు ఇలాగే చేసి మళ్ళీ రాజీనామ వెనక్కి తీసుకున్నాను. అంది మీనా భారంగా.

"నువ్వెదైనా సలహా చెప్తావని" అంటూ నసిగింది మీన అప్పటికే కోపంగా చూస్తున్న కళని చూస్తూ ఏమీ మాట్లాడలేదు మీనా.

ఈ సారి కోపంగా చూడలేదు కళ. పక పకా నవ్వింది.

" ఏమైంది? మేము నీకు జోక్ చెప్పలేదే? అన్నారు మిగతా ఇద్దరూ చిరుకోపంగా.

" నిజమే, కానీ ఇంతకంటే పెద్ద జోక్ నాకేమీ కనబడడం లేదు. ప్రపంచంలో అందరినీ అడిగి అప్పుడు మీ నిర్ణయం తీసుకుంటారా? ఒకవేళ వాళ్ళు మళ్ళీ వచ్చి అలా కాదు ఇలా అంటే మార్చేసుకుంటారా? మీ కంటూ స్వంత అభిప్రాయాలుండవా? నువ్వు ఎం.బియే మొదలుపెట్టినప్పుడే కొన్ని తరగతులు కాంపస్ లో ఉంటాయని, అవి మరీ అత్యవసర పరిస్థితి అయితే తప్ప అందరూ తప్పకుండా వెళ్ళాలని నీకు తెలీదా? అప్పుడు అనహిత కూడా ఉందిగా? మరి ఎందుకీ వాదన? ' కేవలం మనందరం చెప్పడం వల్ల తను వెళ్ళింది కానీ పాపని వదిలి వెళ్తుందా? అనిపించుకోవడమా? "

" అది ఎప్పుడూ ఇలా సూటిగానే మాట్లాడుతుంది కదా ఆశా! ఒక అమ్మగా నీ బాధ నేనర్థం చేసుకోగలను. దానికంటే తెలీదు కాని" అంది మీనా ఆశతో.

" ఒహో! అమ్మగా మరొక అమ్మని అర్థం చేసుకున్నందుకు థాంక్ యూ మీనా, మరి నీకెందుకు సమస్య?తమ పిల్లల వెనకే 24/7 ఉండడం మంచి పేరెంటింగ్ అయితే మరి నువ్వు చేస్తున్న ఉద్యోగం వదిలి పెట్టడానికి ఇంత ఆలోచన ఎందుకు?

చెప్పు మీనా? దానికి కూడా అందరి పర్మిషన్ లూ కావాలా? నీ ఇష్టం నీ కెరియర్. ఒక ఆధునిక మహిళగా నువ్విది నీ అంత నీవుగా చెయ్యలేవా?

ఎక్కడైనా పెట్టి వోటు వెయ్యమందామా పోనీ? హాస్యం సంగతి అలా ఉంచితే సిటీల్లో ఆటుపోట్లకి తట్టుకుని సఫలత పొందిన మీరిద్దరూ మీ మీ నిర్ణయాలు మీరు తీసుకోవచ్చు కదా ! అదే మీ భర్తలు చెప్పారు.

ఒకసారి పరిస్థితిలోని పాయింట్లన్నీ రాసుకోండి, అప్పుడు బేరీజు వేసుకోండి. ఆపైన నువ్వేమంటావ్ అని కాక నేనేమనుకుంటాను? నాకేది ఇష్టం?నాకేది మంచిది అని నిర్ణయం చేసుకోండి. మీ మనసుకి ఏది నచ్చితే అది చెయ్యండి " అంది కళ స్థిరంగా. మిగతాఇద్దరూ ఆలోచనలో పడ్డారు.

వాళ్ళు ఆలోచనలో ఉండగానే అంది ఆమె. " ఇందాకా సమస్య నాది కాదు అన్నారుకదా, అమ్మ నాలుగు రోజుల క్రితం బాత్రూంలో జారి పడింది. ఈ వయసులో తుంటి ఎముక ఆపరేషన్ రిస్కు అని కొందరూ, పరవాలేదని కొందరూ నేనడక్కుండానే చెప్పారు. అయినా చురుగ్గా తిరిగే అమ్మ తిరిగి నడిస్తే చాలని ఆపరేషన్ చేయించడానికే నిర్ణయించాను. నాన్న తీరు రోజు రోజుకీ చిన్న పిల్లలకంటే ఎక్కువగా ఉంది, దాచినది కొంత ఉంది, నాన్న పెన్షన్ వస్తుంది కదా! ఉద్యోగం మానేస్తేనో? అనుకున్నాను కానీ అనుకున్నప్పుడల్లా ఇది నాకూ,నా తల్లి తండ్రులకీ ఇచ్చే భరోసాని దృష్టిలో ఉంచుకొని కొనసాగడానికే నిర్ణయించుకున్నాను. ఎంత మంది వద్దన్నా సరే " అంది.

COMMENTS